క్లుప్తంగా

మున్సిపల్ డీఈని సస్పెండ్ చేయాలి

గుంతకల్లుటౌన్: మున్సిపల్ ఇంజినీరింగ్ విభాగంలో పనిచేసే మహిళా ఉద్యోగినులతో పాటు పలు వార్డు సచివాలయ మహిళా సౌకర్యాల కార్యదర్శులతో అసభ్యకరంగా ప్రవరిస్తున్న డీఈ హేమచంద్రను సస్పెండ్ చేయాలని సీపీఐ(ఎంఎల్)న్యూడెమోక్రసీ పార్టీ డివిజన్ కార్యదర్శి బి.సురేష్ డిమాండ్ చేశారు. బుధవారం న్యూడెమోక్రసీ పార్టీ నాయకులు మున్సిపల్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ విశ్వనాథ్‌ను కలిసి మహిళా ఉద్యోగినుల పట్ల వికృతచేష్టలకు పాల్పడుతున్న డీఈపై విచారణ జరిపించాలని వినతిపత్రాన్ని అందజేశారు. ఆ పార్టీ పట్టణ కార్యదర్శి జి.చిన్నా, మహిళా నేతలు పాల్గొన్నారు.

'నేడు గడప గడపకూ మన ప్రభుత్వం'

యల్లనూరు: వెంకటాంపల్లిలో ఎమ్మెల్యే జొన్నలగడ్డ పద్మావతి గురువారం సాయంత్రం 4 గంటలకు గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు జెడ్పీటీసీ భోగతి ప్రతాప్‌రెడ్డి, వైఎస్సార్‌సీపీ నేత ఈశ్వర రెడ్డి తెలిపారు. వైఎస్సార్‌సీపీ కార్యకర్తలు, నాయకులు పాల్గొనాలని వారు కోరారు.

డిజిటల్ లావాదేవీలపై అవగాహన

పామిడి: పట్టణంలోని భవితకేంద్రంలో బుధవారం మెప్మా ఆధ్వర్యంలో పేటీఎం సంస్థ సౌజన్యంతో వీధి విక్రయదారులకు పేటీఎం కార్డులను పంపిణీ చేశారు. ఈసందర్భంగా మెప్మా టీఎంసీ చంద్రశేఖర్ తోపుడు బండ్ల వ్యాపారులకు డిజిటల్ ఆర్థిక లావాదేవీలపై అవగాహన కల్పించారు. పేటీఎం కార్డులు ఎలా వినియోగించాలన్న తదితర అంశాలపై ఆ సంస్థ మేనేజర్ అఫ్రోజ్, మెప్మా టీఎంసీ చంద్రశేఖర్ వివరించారు.

నేడు సచివాలయ కన్వీనర్లు, గృహసారథులకు శిక్షణ

యల్లనూరు: ఎంపీడీఓ కార్యాలయం వద్ద గురువారం ఉదయం 11 గంటలకు సచివాలయ కన్వీనర్లు, గృహసారథులకు ప్రత్యేక శిక్షణ ఏర్పాటు చేసినట్లు వైఎస్సార్‌సీపీ నాయకులు తెలిపారు. కార్యక్రమానికి ప్రభుత్వవిద్య సలహాదారు ఆలూరు సాంబశివారెడ్డి హాజరవుతారన్నారు. ప్రజాప్రతినిధులు, వైఎస్సార్‌సీపీ శ్రేణులు, సచివాలయ కన్వీనర్లు, గృహసారథులు పాల్గొనాలని కోరారు.

రాజ్యాధికార సాధనకు ఐక్యం కావాలి

తాడిపత్రి టౌన్ : రాజ్యాధికారం సాధించేందుకు బీసీలు ఐక్యం కావాలని బీసీ సంక్షేమ సంఘ జిల్లా అధ్యక్షుడు రాజేంద్ర, పట్టణాధ్యక్షుడు వెంకటేశ్వర్లు పేర్కొన్నారు. స్థానిక బీసీ సంక్షేమ సంఘం కార్యాలయంలో బుధవారం సాయంత్రం నియోజకవర్గ స్థాయి బీసీ ఆత్మీయ సభ జరిగింది. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ బీసీలు రాజకీయంగా ఎదగాలన్నారు. అనంతరం బీసీల సమస్యలపై చర్చించారు. సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు సుబ్బరాయుడు, పట్టణ ఉపాధ్యక్షుడు పక్రుద్దీన్, గౌరవాధ్యక్షుడు బ్రహ్మయ్య ఆచారి, నాయకులు ఆనందరావు, రమేష్ పాల్గొన్నారు.

గుర్తింపు కార్డు కోసం దరఖాస్తు చేసుకోండి

తాడిపత్రి టౌన్ : కార్మికశాఖ నిబంధనల మేరకు 18 నుంచి 60 ఏళ్లున్న అర్హత కలిగిన కార్మికులందరూ గుర్తింపు కార్డు కోసం దరఖాస్తు చేసుకోవాలని తాడిపత్రి కార్మికశాఖ సహాయ అధికారి ప్రతాప్‌నాయుడు ఓ ప్రకటనలో తెలిపారు. భవన నిర్మాణ కార్మికులు, మట్టి పని, పునాది, తాపీ మేస్త్రీలు, కార్పెంటర్లు, పెయింటర్స్, ఐరన్ కార్మికులతోపాటు వివిధ పనుల కార్మికులు తమ పేర్లను రిజిస్ట్రేషన్ చేయించుకోవాలని కోరారు.

ఘనంగా కళాశాల వార్షికోత్సవం

గుంతకల్లు రూరల్: విద్యార్థులు ఏకాగ్రతతో చదివి లక్ష్యంవైపు అడుగులు వేయాలని శ్రీశంకరానందగిరీ జూనియర్ కళాశాల కరస్పాండెంట్ కేసీ హరి సూచించారు. బుధవారం కళాశాల వార్షికోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. కళాశాల ప్రిన్సిపల్ బ్రహ్మానందరెడ్డి, అధ్యాపకులు పాల్గొన్నారు.

వరిలో జింక్ లోపం నివారించుకోండి



వరి పంటను పరిశీలిస్తున్న ఏఓ చిన్నమ్మ

శింగనమల: శింగనమల చెరువు కింద సాగైన వరి పంటకు జింక్ లోపం ఉందని, రైతులు సస్యరక్షణ చర్యలు తీసుకోవాలని ఏఓ చిన్నమ్మ తెలిపారు. బుధవారం వరి పొలాలను పరిశీలించారు. ఏఓ మాట్లాడుతూ వరి ఆకులు ఎరుపు రంగుకి మారితే చిలేటెడ్ జింక్ సల్ఫేట్ 2 గ్రాములు, ఐరన్ సల్ఫేట్ లేదా అన్నభేది 2 గ్రాములు ఒక లీటర్ నీటికి కొద్దిగా నిమ్మరసం కలిపి పిచికారీ చేయాలన్నారు. ఏఈఓ అక్కమ్మ, వ్యవసాయ సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

ప్రజా సంక్షేమ యాత్రకు నీరాజనం



పెద్దవడుగూరులో ఎమ్మెల్యే కేతిరెడ్డి పెద్దారెడ్డికి హారతితో స్వాగతం పలుకుతున్న మహిళలు

పెద్దవడుగూరు : తాడిపత్రి ఎమ్మెల్యే కేతిరెడ్డి పెద్దారెడ్డి చేపట్టిన ప్రజా సంక్షేమ యాత్రకు ప్రజలు అడుగడుగునా నీరాజనం పలికారు. బుధవారం దిమ్మగుడి గ్రామం నుంచి ప్రారంభమైన పాదయాత్ర చిన్నవడుగూరు మీదుగా పెద్దవడుగూరుకి చేరుకుంది. ఈ సందర్భంగా ఆయా గ్రామాల ప్రజలు ఎమ్మెల్యే పాదయాత్రకు ఘన స్వాగతం పలుకుతూ పూల వర్షం కురిపించారు. ఆయా గ్రామాల్లో ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ప్రజల సంక్షేమమే తన అభిమతమని ఎమ్మెల్యే పేర్కొన్నారు. ఏళ్ల తరబడి ఉన్న సమస్యలను పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. కులమతాలు, రాజకీయాలకు అతీతంగా ప్రభుత్వం సంక్షేమ పథకాలు అందిస్తోందన్నారు. మండలంలో పాదయాత్ర ద్వారా వచ్చిన సమస్యలను త్వరగా పరిష్కరించడానికి చర్యలు తీసుకుమంటామన్నారు. దిమ్మగుడి ప్రజా సంక్షేమ యాత్రకు ఉరవకొండ మాజీ ఎమ్మెల్యే విశ్వేశ్వరరెడ్డి, రాప్తాడు ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాష్‌రెడ్డి, అనంతపురం ఏడీసీసీ బ్యాంకు చైర్‌పర్సన్ మానికింద లిఖిత, మాజీ చైర్మన్ పామిడి వీరాంజనేయులు ఎమ్మెల్యేతో కలిసి అడుగులు వేశారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ రైతు విభాగం రాష్ట్ర కార్యదర్శి గూడూరు సూర్యనారాయణరెడ్డి, మండల కన్వీనర్ ఎద్దుల శరభారెడ్డి, యువజన విభాగం కన్వీనర్ కృష్ణారెడ్డి, జెడ్పీటీసీ బాస్కర్‌రెడ్డి, మాజీ జెడ్పీటీసీ చితంబరరెడ్డి, ఎంపీపీ శ్రీదేవి, సర్పంచ్ వరలక్ష్మి, జిల్లా అధికార ప్రతినిధి పాశం రంగస్వామి, అనంతపురం పార్లమెంట్ యువజన విభాగం ప్రధాన కార్యదర్శి రామచంద్రారెడ్డి, బీసీ విభాగం నేత వెంకటస్వామిగౌడ్, పుట్లూరు కృష్ణారెడ్డి, శేషారెడ్డి, ప్రకాష్‌రెడ్డి, భాస్కర్‌రెడ్డి, నారాయణరెడ్డి, వీరారెడ్డి, నాగరాజు, సుంకన్న , శ్రీరాములు తదితరులు పాల్గొన్నారు.

వైఎస్సార్ బీమా సొమ్ము అందజేత



వైఎస్సార్ బీమా సొమ్ము అందిస్తున్న ఎమ్మెల్యే వైవీఆర్

గుంతకల్లుటౌన్: వజ్రకరూరు మండలం పీసీ ప్యాపిలి వద్ద రెండు నెలల క్రితం జరిగిన రోడ్డు ప్రమాదంలో మృతిచెందిన 25వ వార్డుకు చెందిన ఎరుకుల శ్రీకాంత్ కుటుంబసభ్యులకు వైఎస్సార్ బీమా ద్వారా మంజూరైన రూ.5 లక్షల ఆర్థిక సాయాన్ని బుధవారం ఎమ్మెల్యే వై.వెంకటరామిరెడ్డి అందజేశారు. ఈ సందర్భంగా సీఎం వైఎస్.జగన్, ఎమ్మెల్యే వైవీఆర్‌కు మృతుడి కుటుంబసభ్యులు కృతజ్ఞతలు తెలియజేశారు. కార్యక్రమంలో కోఆప్షన్ సభ్యులు ఫ్లయింగ్‌మాబు, నూర్‌నిజామి, సచివాలయాల పట్టణ కన్వీనర్ జింకల రామాంజినేయులు, మార్కెట్ వెంకటేష్ పాల్గొన్నారు.

ఆశావర్కర్లకు నియామకపత్రాల అందజేత

పట్టణంలో ఆశావర్కర్లుగా నియమితులైన ముగ్గురికి ఎమ్మెల్యే వై.వెంకటరామిరెడ్డి నియామకప్రతాలను అందజేశారు. బుధవారం ఎమ్మెల్యే నివాసం వద్ద జరిగిన కార్యక్రమంలో వైవీఆర్ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం అందిస్తున్న వైద్యసేవలను విస్తృతం చేసి ఆ సేవలను ప్రజలు సద్వినియోగం చేసుకునేలా చూడాలన్నారు. తల్లిబిడ్డల సంరక్షణే ధ్యేయంగా వైద్య ఆరోగ్యశాఖ అమలు చేస్తున్న పథకాల గురించి వారికి వివరించాలని సూచించారు. ప్రభుత్వాస్పత్రి పీపీ యూనిట్ వైద్యాధికారులు డాక్టర్ కళ్యాణ్, డాక్టర్ ఉమా,కౌన్సిలర్లు, కోఆప్షన్ సభ్యులు పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి రాతిదూలం లాగుడు పోటీలు ప్రారంభం



పోటీలు ప్రారంభిస్తున్న దృశ్యం

గుత్తి రూరల్: తొండపాడు బొలికొండ రంగనాథ స్వామి బ్రహ్మోత్సవాల్లో భాగంగా రాష్ట్ర స్థాయి ఒంగోలు జాతి రాతి దూలం లాగుడు పోటీలు బుధవారం ప్రారంభమయ్యాయి. పోటీలను వైఎస్సార్‌సీపీ సీనియర్ నాయకుడు శ్రీనివాస్‌రెడ్డి, మాజీ జెడ్పీటీసీ ప్రవీణ్‌కుమార్ యాదవ్, పురుషోత్తం యాదవ్ ప్రారంభించారు. ఈ సందర్భంగా శ్రీనివాస్‌రెడ్డి మాట్లాడుతూ ఏటా తిరునాల సందర్భంగా పోటీలు నిర్వహించడం హర్షించదగ్గ విషయమన్నారు. పోటీలకు జిల్లా నుంచే కాక కడప, కర్నూలు, మహబూబ్‌నగర్, ఒంగోలు ప్రాంతాల వృషభాలు పాల్గొంటున్నాయని నిర్వాహకులు తెలిపారు. మొదటి రోజు పాల పళ్ల విభాగంలో మొత్తం 44 జతలు పాల్గొన్నాయి. కార్యక్రమంలో జెడ్పీటీసీ రాధికా, సర్పంచ్ రుక్మిణమ్మ, వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ గోవర్ధన్‌రెడ్డి, నాయకులు మల్లయ్యయాదవ్, బేడల వెంకటరాముడు, కొత్తపేట రాము, ఎస్సీ.రంగయ్య, గురుప్రసాద్ యాదవ్, కౌన్సిలర్లు ఫరూక్, సుబ్బయ్య పాల్గొన్నారు.

ఎమ్మెల్యే చొరవతో రోడ్డు నిర్మాణం



మల్లాగుండ్ల నుంచి చింతకాయమందకు చిత్రావతి నదిపై వేసిన మట్టి రోడ్డు

యల్లనూరు: రోడ్డు సౌకర్యం లేక రెండు గ్రామాల ప్రజలు పడుతున్న కష్టాలను దృష్టిలో ఉంచుకొని ప్రభుత్వ విద్య సలహాదారు ఆలూరుసాంబశివారెడ్డి, ఎమ్మెల్యే జొన్నలగడ్డ పద్మావతి ప్రత్యేక చొరవ తీసుకొని మల్లాగుండ్ల- చింతకాయమంద గ్రామాల రహదారి నిర్మాణానికి శ్రీకారం చుట్టారు. గతంలో చిత్రావతి నదిలో ప్రజల రాకపోకలు లేక చాలా ఇబ్బందులు పడుతుండేవారు. అయితే సమస్యను గుర్తించిన ఎమ్మెల్యే, విద్యా ప్రభుత్వ సలహాదారు మట్టి రోడ్డు వేయించి ప్రజల నుంచి మన్ననలు పొందారు. గతంలో శింగవరం రోడ్డును మరమ్మతు చేయించారు. తాజాగా మల్లాగుండ్ల రోడ్డును సొంత నిధులతో మట్టి రోడ్డు వేయించిన ఎమ్మెల్యే, ఆలూరు సాంబశివారెడ్డి పనితీరుపై ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు. మల్లాగుండ్ల వైఎస్సార్‌సీపీ కార్యకర్తలు కొండారెడ్డి, రామ్మోహన్ రెడ్డి దగ్గరుండి రోడ్డు పనులను పర్యవేక్షించారు.

ఇళ్ల స్థలాలు పంపిణీ చేయాలి

గుంతకల్లు రూరల్: అర్హులకు ఇళ్ల స్థలాలను పంపిణీ చేయడంతో పాటు, వారికి ఇళ్లు నిర్మించి ఇవ్వాలని కోరుతూ సీపీఎం నాయకులు బుధవారం స్థానిక తహసీల్దార్ కార్యాలయం ముందు ధర్నా చేపట్టారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ గుడిసెల్లో జీవిస్తున్న వారికి ఇళ్ల పట్టాలతోపాటు, ఇళ్ల నిర్మాణానికి రూ.5 లక్షలు మంజూరు చేయాలన్నారు.

గార్లదిన్నె: అర్హులకు ఇంటి పట్టాలు ఇవ్వాలని సీపీఎం నాయకులు పేర్కొన్నారు. బుధవారం తహసీల్దార్ కార్యాలయం వద్ద నిరసన కార్యక్రమం చేపట్టారు. స్పందించిన తహసీల్దార్ ఉషారాణి అర్హులందరికీ ఇంటి పట్టాలు ఇస్తామని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో నాయకులు చెన్నారెడ్డి, నాగరాజు, రాముడు, నాగమ్మ, రాము, తదితరులు పాల్గొన్నారు.

కేసు నమోదు

యాడికి: పుప్పాల గ్రామంలో మంగళవారం రైతు ఆదినారాయణకు చెందిన పొలంలో ఫెన్సింగ్ రాళ్లను అదే గ్రామానికి చెందిన సుధాకర్, రంగయ్య ధ్వంసం చేశారు. రైతు ఆదినారాయణ తనకు రూ.5వేలు నష్టం వాటిల్లిందని బుధవారం పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. ఈ మేరకు ఇద్దరిపై మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ గురుప్రసాద్‌రెడ్డి తెలిపారు.

ఇసుక ట్రాక్టర్ల పట్టివేత

తాడిపత్రి: రూరల్ పరిధిలోని పలు ప్రాంతాల్లో అక్రమంగా ఇసుక తరలిస్తున్న 6 ట్రాక్టర్లను పట్టుకుని కేసు నమోదు చేసినట్లు రూరల్ సీఐ చిన్న పెద్దయ్య బుధవారం తెలిపారు. ట్రాక్టర్లను స్టేషన్‌కు తరలించినట్లు పేర్కొన్నారు.

ట్రాన్స్‌కో రిటైర్డ్ చీఫ్ ఇంజినీర్ మృతి



సయ్యద్‌సాబ్(ఫైల్)

గుత్తి: పట్టణంలోని జెండా వీధికి చెందిన ట్రాన్స్‌కో చీఫ్ ఇంజినీర్ సయ్యద్ సాబ్(71) హైదరాబాద్‌లోని ఓ ప్రైవేట్ ఆసుపత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందారు. సమాచారం తెలుసుకున్న మున్సిపల్ చైర్‌పర్సన్ వన్నూర్‌బీ, పట్టణ కన్వీనర్ పీరా, జిల్లా నాయకులు మధుసూదన్ రెడ్డి, పలువురు వైఎస్సార్‌సీపీ నాయకులు, ట్రాన్స్‌కో అధికారులు సయ్యద్ సాబ్ మృతదేహంపై పుష్పగుచ్ఛాలు ఉంచి నివాళులర్పించారు. మృతుని కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు.

గొల్లపల్లిలో వైద్య శిబిరం

నార్పల: గొల్లపల్లిలో బుధవారం సర్పంచు రామాంజనేయులు ఆధ్వర్యంలో ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా రామాంజినేయులు మాట్లాడుతూ గ్రామస్తులు గుండె జబ్బులతో బాధపడకుండా ఉండాలని ముందు జాగ్రత్తగా ఉచితంగా గుండె పరీక్షలు చేయించానన్నారు. కిమ్స్ సవీరా వైద్య బృందానికి కృతజ్ఞతలు తెలిపారు. పంచాయతీ కార్యదర్శి వెంకట్‌రెడ్డి, వైద్య బృందం ఆరీఫ్, శ్రీనివాస్, ఏఎన్ఎం ఫరిదాబాను పాల్గొన్నారు.

నవరత్నాలతో పేదల అభ్యున్నతి



సంక్షేమ లబ్ధిని వివరిస్తున్న ఎమ్మెల్యే వై.వెంకటరామిరెడ్డి

- ఎమ్మెల్యే వై.వెంకటరామిరెడ్డి

గుంతకల్లుటౌన్: రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న నవరత్నాల్లాంటి సంక్షేమ పథకాలు పేదల అభ్యున్నతికి ఎంతగానో దోహదపడుతున్నాయని ఎమ్మెల్యే వై.వెంకటరామిరెడ్డి అన్నారు. బుధవారం పట్టణంలోని 7వ వార్డులో గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే వైవీఆర్ ఇంటింటికీ వెళ్లి మూడున్నరేళ్లలో సంక్షేమ పథకాల ద్వారా ఆయా కుటుంబాలకు చేకూరిన లబ్ధిని వివరించారు. ప్రజల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఆంకాలమ్మ గుడివీధిలో సీసీ రోడ్లు, డ్రైనేజీలను ఏర్పాటు చేయించాలని స్థానికులు కోరారు. రెండు నెలల్లోపు పనులు పూర్తి చేయించాలని ఆయన మున్సిపల్ అధికారులకు సూచించారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ సీఎం జగన్‌కు ప్రజల్లో ఆదరణ పెరుగుతోందన్నారు. గడపగడపకూ మన ప్రభుత్వం కార్యక్రమంలో భాగంగా ఇంటింటికీ వెళ్తుంటే పథకాల అమలు పట్ల ప్రజలు సంతోషం వ్యక్తం చేస్తున్నారని చెప్పారు. మళ్లీ జగనన్నే ముఖ్యమంత్రి కావాలని ప్రజలంతా కోరుకుంటున్నారని ఆయన తెలియజేశారు. సీఎం జగన్‌కు చల్లని దీవెనలందించాలని ఎమ్మెల్యే ప్రజలను కోరారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్‌పర్సన్ ఎన్.భవాని, 7వ వార్డు కౌన్సిలర్ కురుబ లింగన్న, మున్సిపల్ కమిషనర్ బండి శేషన్న, మార్కెట్‌యార్డు చైర్మన్ ఎస్‌వీఆర్.మోహన్, మున్సిపల్ మాజీ చైర్మన్ రామలింగప్ప, వార్డు సీనియర్ నాయకులు మహదేవ, సాంబ, వార్డు సచివాలయాల పట్టణ కన్వీనర్ జింకల రామాంజనేయులు, పార్టీ పట్టణ అధ్యక్షుడు బి.సుంకప్ప, సింగిల్‌విండో అధ్యక్షుడు సుంకిరెడ్డి, కౌన్సిలర్లు జేసీబీ.చాంద్‌బాషా, వై.సుధాకర్, భాస్కర్, కోఆప్షన్‌సభ్యులు ఫ్లయింగ్‌మాబు, నూర్‌నిజామి, వార్డు ఇన్‌చార్జ్‌లు మాచర్ల శివ, పీఎస్.మస్తాన్ తదితరులు పాల్గొన్నారు.

సంక్షేమ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలి



మాట్లాడుతున్న ఎంపీపీ యోగేశ్వరి

శింగనమల: సంక్షేమ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని ఎంపీపీ యోగేశ్వరి అన్నారు. బుధవారం ఎంపీడీఓ కార్యాలయంలో ఎంపీపీ అధ్యక్షతన మండల సర్వసభ్య సమావేశం జరిగింది. ఎంపీపీ యోగేశ్వరి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పేదలకు అనేక సంక్షేమ పథకాలు అమలు చేస్తున్నారని, వీటిపై ప్రజలకు మరింత అవగాహన కల్పించి, అర్హులందరికీ పథకాలు అందించాలన్నారు. పలువురు ఎంపీటీసీలు, సర్పంచ్ మాట్లాడుతూ సచివాలయాల్లో సిబ్బంది సక్రమంగా పని చేయడం లేదని, పని చేయని వారిపై చర్యలు తీసుకోవాలన్నారు. ఎంపీడీఓ నిర్మలాకుమారి మాట్లాడుతూ సచివాలయాల్లో సక్రమంగా పని చేయని సిబ్బందిపై ఫిర్యాదు చేస్తే, విచారించి చర్యలు తీసుకుంటామన్నారు. ఎంఈఓ నరసింహరాజు మాట్లాడుతూ ఫుడ్ పాయిజన్ సంఘటనపై విచారణ జరిపి, సిబ్బందిని తొలగించామన్నారు. దీనితో పాటు కేజీబీవీలో సీసీ కెమెరాలు ఏర్పాటు చేశామన్నారు. సమావేశంలో వైస్ ఎంపీపీ నరసింహులు , మండల స్పెషలాఫీసర్ ఉమాశంకరమ్మ, ఎంపీటీసీలు కరుబ ఉమా, మెరార్జీ, చిన్న జయన్న, ఆలీ, రమేష్, సునీత, రఘునాథరెడ్డి, సర్పంచ్‌లు నాగమునెమ్మ, ఓబిలేసు, రమేష్ తదితరులు పాల్గొన్నారు.

ఉపాధి కూలీల హాజరు శాతాన్ని పెంచండి



శింగవరంలో ఉపాధి కూలీలతో మాట్లాడుతున్న ఏపీడీ వెంకటరత్నం

యల్లనూరు: ఉపాధి కూలీ హాజరు శాతాన్ని పెంచాలని డ్వామా ఏపీడీ వెంకటరత్నం పేర్కొన్నారు. బుధవారం శింగవరం, వెంకటాంపల్లిలో ఆయన మస్టర్ తనిఖీలు చేశారు. అనంతరం కూలీల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. అలాగే వేసవి కాలం సమీపిస్తుండటంతో కూలీలు పని గంటలు, పనుల్లో నాణ్యత తప్పనిసరిగా పాటించాలన్నారు. అనంతరం ఎంపీడీవో కార్యాలయానికి చేరుకొని ఉపాధి సిబ్బందితో సమావేశాన్ని ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ప్రతి పంచాయతీలో కూలీలకు విరివిగా పనులు కల్పించాలన్నారు. ఏపీఓ షబ్బీర్ బాషా, ఈసీ బబ్లు, ఫీల్డ్, టెక్నికల్ అసిస్టెంట్లు పాల్గొన్నారు.

గుత్తి రూరల్: గ్రామాల్లో ఉపాధి పనులు చేసే కూలీల సంఖ్యను పెంచాలని ఎంపీడీఓ చిట్రా శ్రీనివాసులు సిబ్బందికి ఆదేశించారు. బుధవారం స్థానిక కార్యాలయంలో ఏపీఓ మద్దిలేటితో కలిసి మండలంలోని సిబ్బందితో సమావేశం నిర్వహించారు. ఎంపీడీఓ మాట్లాడుతూ కూలీలకు అవగాహన కల్పించి కూలీల సంఖ్య పెంచి పనుల లక్ష్యం త్వరగా పూర్తి చేయాలన్నారు. పనులు జరిగే చోట వసతులు కల్పించాలన్నారు. కార్యక్రమంలో టీఏ లోకేష్, ఫీల్డ్ అసిస్టెంట్లు రంగయ్య, ఈశ్వర్, గోపాల్ పాల్గొన్నారు.

పామిడి: దేవరపల్లి గ్రామంలో ఉపాధి పనులనుఎంపీడీఓ ప్రభాకర్‌నాయక్ బుధవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈసందర్భంగా ఆయన కూలీలు చేపడుతున్న కందకం తవ్వకాల పనులను పరిశీలించారు. మస్టర్‌ను తనిఖీ చేశారు. అనంతరం పీ కొండాపురంలో నిర్మిస్తున్న సీసీరోడ్డు పనులను తనిఖీ చేశారు.

పప్పుశనగ రైతులు రిజిస్ట్రేషన్ చేయించుకోవాలి

యాడికి: పప్పుశనగకు ప్రభుత్వం క్వింటాల్ రూ.5,335 మద్దతు ధర ప్రకటించినదని ఏఓ మహబూబ్‌బాషా బుధవారం ఓ ప్రకటనలో తెలిపారు. మండల వ్యాప్తంగా 4,724 ఎకరాల్లో పప్పుశనగను సాగు చేసిన 1,196 మంది రైతులు ఆయా గ్రామాల్లోని రైతు భరోసా కేంద్రాల్లో రిజిస్ట్రేషన్ చేసుకోవాలన్నారు. గురువారం నుంచి ఆయా గ్రామాల్లోని రైతు భరోసా కేంద్రాల్లో పప్పుశనగ కొనుగోలు ప్రారంభమవుతుందన్నారు. పప్పుశనగ అమ్మదలచుకున్న రైతులు తమ వెంట భూమి పాసు పుస్తకం, ఆధార్ కార్డు తప్పనిసరిగా తీసుకు రావాలన్నారు.

ఆర్బీకేల్లో కొనుగోలు చేయాలి

పుట్లూరు: రబీలో పండిన పప్పుశనగ పంటను రైతు భరోసా కేంద్రాల ద్వారా కొనుగోలు చేయాలని వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షుడు సూరి డిమాండ్ చేశారు. ప్రభుత్వం ప్రకటించిన మద్దతు ధరతో షరతులు లేకుండా క్వింటాల్ రూ.5,335ల ప్రకారం కొనగోలు చేయాలన్నారు.

రీ సర్వేతో భూ సమస్యల పరిష్కారం



మాట్లాడుతున్న జిల్లా పరిషత్ వైస్ చైర్‌పర్సన్ నాగరత్నమ్మ

నార్పల: వైఎస్సార్ జగనన్న భూ హక్కు, భూ రక్ష కింద జరుగుతున్న రీ సర్వేతో భూ సమస్యలు పరిష్కారమవుతాయని జెడ్పీ వైస్ చైర్‌పర్సన్ నాగరత్నమ్మ పేర్కొన్నారు. బుధవారం మండల పరిషత్ కార్యాలయంలో రైతులకు భూ సర్వేపై అధికారులు నిర్వహించిన అవగాహన కార్యక్రమంలో ఆమె మాట్లాడారు. రాష్ట్ర వ్యాప్తంగా భూముల రీ సర్వే జరుగుతోందని, ప్రతిఒక్కరూ సహకరించాలన్నారు. ఎంపీపీ నాగేశ్వరావు, సర్పంచు మస్నీల సుప్రియ, తహసీల్దార్ నారాయణస్వామి, డీటీ షేక్షావలి, సర్వేయర్ బ్రహ్మానందం పాల్గొన్నారు.

సేవాగఢ్ ఉత్సవాలు జయప్రదం చేయండి



పోస్టర్లు విడుదల చేస్తున్న ఏఐబీఎస్ఎస్ నాయకులు

గుత్తి రూరల్: సేవాగఢ్‌లో ఈ నెల 13, 14, 15 తేదిల్లో జరిగే సంత్ సేవాలాల్ మహరాజ్ 284వ జయంతి ఉత్సవాలను జయప్రదం చేయాలని ఆల్ ఇండియా బంజారా సేవా సంఘం నాయకులు పిలుపునిచ్చారు. బుధవారం సేవాగఢ్‌లోని సంత్ సేవాలాల్ మహారాజ్ ఆలయ ఆవరణలో ఏఐబీఎస్ఎస్ జిల్లా అధ్యక్షుడు బాలాజీ నాయక్, ప్రధాన కార్యదర్శి బాబు నాయక్ సేవాగఢ్ ఉత్సవాల పోస్టర్లను విడుదల చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ దేశ, విదేశాల్లో ఉన్న బంజారాలు 13 నుంచి మూడు రోజుల పాటు జరిగే ఉత్సవాలకు పెద్ద ఎత్తున తరలిరావాలని విజ్ఞప్తి చేశారు.

రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి గాయాలు

బుక్కరాయసముద్రం: మండల కేంద్రంలోని మార్కండేయ స్వామి దేవాలయం సమీపంలో బుధవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి తీవ్రగాయాలయ్యాయి. ఎస్ఐ శివ ప్రసాద్ తెలిపిన వివరాలు..అనంతపురానికి చెందిన శ్రీనివాసులు, ఈశ్వర్ బైక్ గూగూడు కుళ్లాయి స్వామి దర్శనానికి బయలుదేరారు. మార్కండేయ స్వామి దేవాలయం సమీపంలో రోడ్డుకు అడ్డంగా పంది రావడంతో బైక్ అదుపుతప్పి కిందపడ్డారు. తీవ్రంగా గాయపడిన వారిని 108 వాహనంలో అనంతపురం ప్రభుత్వాసుపత్రికి తరలించారు. ఈ మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు.

ఎద్దు పొడిచి రైతుకు తీవ్ర గాయాలు



గాయపడిన రామ్మోహన్

గుత్తి రూరల్: తొండపాడు గ్రామంలో బుధవారం ఎద్దు పొడిచి ఓ రైతుకు తీవ్ర గాయాలయ్యాయి. వివరాలిలా ఉన్నాయి. నంద్యాల జిల్లా ప్యాపిలి మండలం రాచవాండ్లపల్లి గ్రామానికి చెందిన రైతు టి.రామ్మోహన్ తొండపాడులో జరుతున్న రాష్ట్ర స్థాయి రాతి దూలం లాగుడు పోటీలను చూసేందుకు స్నేహితులతో కలిసి వచ్చారు. కోర్టు బయట నిల్చొని పోటీలు తిలకిస్తున్న రైతులపైకి బెదిరిన ఓ ఎద్దు దూసుకొచ్చింది. అక్కడే ఉన్న రామ్మోహన్‌ను ఎద్దు పొడవడంతో తల, మొహం, చేతులకు బలమైన గాయాలయ్యాయి. స్నేహితులు అతడిని గుత్తి ప్రభుత్వాసుపత్రికి తరలించారు. తర్వాతవైద్యుల సూచన మేరకు కర్నూలుకు తరలించారు. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

గుత్తి డిప్యూటీ తహసీల్దార్ ఆకస్మిక మృతి



హాజీవలి మృతదేహం వద్ద నివాళులు అర్పిస్తున్న నాయకులు

గుత్తి /గుత్తి రూరల్: గుత్తి డిప్యూటీ తహసీల్దార్ హాజీవలి(54) బుధవారం ఆకస్మికంగా మృతి చెందారు. డీటీ హాజీవలి రెండు కిడ్నీలు దెబ్బతిని అనంతపురంలోని ఓ ప్రైవేటు ఆసుపత్రిలో డయాలసిస్ చేయించుకునేవాడు. మంగళవారం రాత్రి తీవ్ర అస్వస్థతకు గురి కావడంతో కుటుంబసభ్యులు వెంటనే ఆసుపత్రికి తరలించారు. వైద్యులు చికిత్స అందించినప్పటికీ కోలుకోలేక బుధవారం ఉదయం మృతి చెందాడు. విషయం తెలుసుకున్న తహసీల్దార్ మహబూబ్ బాషా, వైఎస్సార్‌సీపీ నాయకులు మంజునాథ్‌రెడ్డి, సుబ్బారెడ్డి, చంద్ర, రెవెన్యూ సిబ్బంది డీటీ మృతదేహానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. కుటుంబసభ్యులకు ప్రగాఢ సానుభూతిని తెలిపారు.

నాటుసారా తరలిస్తున్న వ్యక్తి అరెస్టు

గుత్తి రూరల్: ఊబిచెర్ల శివారులో నాటుసారా తరలిస్తున్న ఓ వ్యక్తిని సెబ్ పోలీసులు బుధవారం అరెస్టు చేశారు. వివరాలు.. కర్నూలు జిల్లా తుగ్గలి మండలం మిద్దె తండాకు రమేష్‌నాయక్ బైక్‌పై నాటుసారా తరలిస్తుండగా పోలీసులు పట్టుకున్నారు. బైక్, 125 లీటర్ల నాటుసారా స్వాధీనం చేసుకున్నారు. నిందితుడిని రిమాండ్‌కు తరలించారు. ఎస్ఐ అలీఅహ్మద్, కానిస్టేబుళ్లు పాల్గొన్నారు.

అనారోగ్యంతో వీఆర్ఓ మృతి



శివకిరణ్(ఫైల్)

పెద్దపప్పూరు: ముచ్చుకోట వీఆర్ఓ బుధవారం గుండె సమస్యతో కర్నూలు ఆసుపత్రిలో మృతి చెందాడు. స్థానికుల వివరాల మేరకు.. తాడిపత్రి మండలం యలమకూరుకు చెందిన శివకిరణ్(34) నాలుగేళ్లుగా ముచ్చుకోట వీఆర్ఓగా పని చేస్తున్నాడు. మూడు నెలల క్రితం గుండె ఆపరేషన్ చేయించుకున్నాడు. వారం రోజుల క్రితం చికిత్స కోసం కర్నూలుకు వెళ్లాడు. పరిస్థితి విషమించడంతో అక్కడే మృతి చెందాడు. మృతునికి భార్య మాధవి, కూతురు, కుమారుడు ఉన్నారు.